# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాలను చేపడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ తిరుపతి విమానాశ్రయం నుంచి ఆధ్యాత్మిక క్షేత్రాలకు విమాన సేవలను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.
- ❖ ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ-20 క్రికెట్ సిరీస్‌ను భారత మహిళా జట్టు కైవసం చేసుకుంది.

========================

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో మార్చి నెల నాటికల్లా వంద శాతం మేర ఇంటింటికీ వెళ్ళి చెత్తను సేకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. పల్నాడు జిల్లా వినుకొండలో “స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర” కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీల్లో 97 శాతం మేర పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తని సేకరిస్తున్నారని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం ఇవ్వాలనే ఉద్దేశంతో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసి చెత్త నుంచి సంపద సృష్టించటంతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశ్యంతో పీ-4 పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని ముఖ్యమంత్రి చెప్పారు.

========================

భక్తులకు విశ్వాసం కలిగించేలా దేవస్థానాలలో పాలన సాగాలని గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. విశాఖ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని ఆయన ఈరోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... దేవాలయాల్లో భక్తులకు అందించే ప్రసాదం పవిత్రంగా ఉండాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ప్రసాదాలను తనిఖీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం దేవస్థానాలలో ఆధునిక లాబోరేటరిలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా స్టాండర్డ్ ఆరేపటింగ్ ప్రొసీజర్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా స్వామివారిని మహారాష్ట్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖా మంత్రి మాధురీ మిశాల్ కూడా దర్శించుకున్నారు.

========================

తిరుపతి విమానాశ్రయం నుంచి షిరిడి లాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలకు విమాన సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి ఆలయంలో స్వామి వారిని కేంద్రమంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ... తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన సర్వీసులను పెంచే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని చెప్పారు. అలాగే ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రాలను కలుపుతూ విమానయాన సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కేంద్ర బడ్జెట్ లో ఈ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. దేశంలో ఉన్న విమానయాశ్రయాలలో మరింత సౌకర్యాలను కల్పిస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 131వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

========================

ప్రతీ ఒక్కరూ మాతృ భాష నేర్చుకోవాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కోరారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా పెట్టిన పోస్టులో ప్రతీ ఒక్కరూ మాతృ భాషను గౌరవించాలని కోరారు. జీవితంలో ఎదిగేందుకు ఎన్ని భాషలు నేర్చుకున్నా.. మనవారితో మాట్లాడేప్పుడు తల్లి నేర్పిన భాషలో సంభాషించాలన్నారు. మాతృభాషను పరిరక్షించేందుకు అందరూ కృషి చేయాలని ఉపముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

విరామం

========================

రాష్ట్ర మత్స్య శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ (GAIS) కింద 4 కోట్ల 75 లక్షల రూపాయలు విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కీమ్ కింద 2018 సంవత్సరం నుండి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రత్యేకంగా పరిశీలించి మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా విడుదల చేసినట్లు చెప్పారు. వారికి ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

========================

నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో ఈ రోజు నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వలన అనర్థాలు, చెట్లు నాటడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రతి ఇంటి నుంచి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ఉద్యమం ప్రారంభం కావాలన్నారు.

========================

ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళలు అభివృద్ధి సాధిస్తారని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు. జిల్లాలోని పాచిపెంట మండలం పి. కోనవలసలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఈ రోజు నిర్వహించిన వ్యక్తిగత అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చదువుతో పాటు శారీరక శ్రమ, నృత్యం వంటి కళల్లో కూడా విద్యార్థినులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా... సమాజంలో ఎలా మెలగాలి, ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు.

========================

ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళా జట్టు సిరీస్ ను 2-1 తేడాతో సొంతం చేసుకుంది. మూడు టీ-20 క్రికెట్ సిరీస్ లో భాగంగా ఆస్ట్రేలియాపై భారత్ తొలిసారి సిరీస్‌ను గెలిచింది. అడిలైడ్ వేదికగా ఈరోజు జరిగిన మూడో టీ-20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్... ఆస్ట్రేలియాకు 177 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. లక్ష్య ఛేదనలో నిర్ణీత 20 ఓవర్లకు ప్రత్యర్థి జట్టు 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా స్మృతి మంధాన నిలిచింది.

========================

కేంద్ర యువజన సర్వీసులు - క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని మై భారత్ ఆధ్వర్యంలో యూత్ పార్లమెంట్ ని విశాఖపట్నంలో ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డిప్యూటీ డైరక్టర్ జి. మహేశ్వరరావు తెలిపారు. యూత్ పార్లమెంత్ లో విశాఖ జిల్లాకు చెందిన 25 ఏళ్ల లోపు యువతీ యువకులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ యూత్ పార్లమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని, అక్కడ విజయం సాధించి వారు జాతీయ పోటీలో పాల్గొంటారని ఆయన వివరించారు.

========================

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం దుంపగడప జిల్లా పరిషత్ హైస్కూల్ లో సి.ఎస్.ఆర్. నిధులు 40 లక్షల రూపాయల వ్యయంతో తరగతి గదుల నిర్మాణ పనులను రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుంపగడప జడ్పీ స్కూల్ తరగతి గదుల కొరతను తీర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు.

========================

హిందూ మహాసముద్రం, దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నైరుతి బంగాళాఖాతం దానికి ఆనుకుని ఉన్న భూమధ్య రేఖా హిందూ మహాసముద్రం వద్ద కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకటరావు తెలియచేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

========================

========================